సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 24 । మార్చి । 2023



వడగండ్లతో వరికి నష్టం

ఇటీవల కురిసిన వడగళ్ల వానకు ఇబ్రహీంపట్నం డివిజన్‌లో వెయ్యి ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది.

10లో ▸

రంజాన్ శుభాకాంక్షలు

పహాడీషరీఫ్: రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లింలకు విద్యాశాఖ మంత్రి సబితా రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు ఉండి పేదల ఆకలి బాధలు తెలుసుకొని, దానధర్మాలు చేస్తూ సమాజసేవలో ముందుండడం ఎంతో గొప్ప విషయమన్నారు. సీఎం కేసీఆర్ అన్ని మతాలను సమానంగా చూస్తున్నారన్నారు. రంజాన్ మాసం సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.



జనం అక్షరం సాక్షిగా..

పదిహేనేళ్ల ప్రస్థానంలో 'సాక్షి' జనం గళం వినిపించింది. సమస్యలను ఎత్తిచూపింది.. భూ ఆక్రమణలను తేటతెల్లం చేసింది.. కబ్జాదారుల హస్తాల్లో చిక్కుకున్న విలువైన ప్రభుత్వ భూములకు విముక్తి కల్పించింది.. ప్రభుత్వ శాఖల్లో అవినీతిని బట్టబయలు చేసింది.. ప్రత్యేక కథనాలతో ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం అందేలా, స్వాంతన చేకూర్చేలా చేసింది.. ఎంతోమంది ప్రతిభను వెలుగులోకి తెచ్చింది.. అనుక్షణం ప్రజాపక్షాన నిలిచింది.. అధికారుల్లో చలనం కలిగించేలా.. సమస్యలకు పరిష్కారం లభించేలా చొరవ చూపింది.. అనేక కీలక ఘటనలు, మార్పులకు 'సాక్షి'గా నిలిచింది.. అటు సమాజాన్ని జాగృతం చేస్తూ, ఇటు అధికార యంత్రాంగాన్ని ప్రభావితం చేస్తూ తనదైన శైలిలో ముందుకు సాగుతోంది.. బాధిత పక్షమనేలా, జనహితమే.. అభిమతమనేలా తనదైన పాత్ర పోషించింది. పదహారవ యేటలోకి ప్రవేశిస్తున్న సందర్భంలో 'సాక్షి' సాధించిన విజయాల్లో కొన్నింటి సమాహారం. – సాక్షి, రంగారెడ్డిజిల్లా

భూ బాధితులకు అండగా ..

- అబ్దుల్లాపూర్‌మెట్, బండరావిరాల, చిన్న రావిరాల మైనింగ్ జోన్‌లో 40 మైన్స్, 17 క్రషర్ల ఏర్పాటు.. యాచారం, కొత్తూరు, తలకొండపల్లి, గండిపేట, కడ్తాల్ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్, క్రషర్ల ఏర్పాటుతో పర్యావరణానికి, జీవరాశికి జరుగుతున్న హానిపై 'మైనింగ్ మాఫియా.. 'కొండలు పిండి'.. వద్దన్నా వినరే..' వంటి శీర్షికలతో వరుస కథనాలు ప్రచురించింది.
- మైనింగ్ లీజుల పునరుద్ధరణ, కొత్త లైసెన్సుల జారీ నిలిపివేత అంశంలోనే కాదు మైనింగ్‌లో భూములు కోల్పోయిన రైతులకు అండగా నిలిచింది. వారి ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారంలో ముందుంది.
- పారిశ్రామిక వాడలు, రియల్ ఎస్టేట్ వెంచర్ల పేరుతో ప్రభుత్వం జిల్లాలో పెద్ద ఎత్తున భూమిని సేకరించింది. చందనవెళ్లి, ముచ్చర్ల, యాచారం ఫార్మాసిటీ, కొత్తూరు పారిశ్రామిక వాడల్లో భూములు కోల్పోయిన భూ బాధితుల గొంతుకగా నిలిచింది. నష్ట పరిహారం చెల్లింపులో జరుగుతున్న జాప్యం, అక్రమాలను వెలుగులోకి తెచ్చి అర్హులకు న్యాయం చేయడంలో విశేష కృషి చేసింది.



అనాథలు, నిరుపేదలకు చేయూత..

- తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందడంతో అనాథలైన ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లికి చెందిన కంబాలపల్లి శిరీష, మౌనికలకు 'సాక్షి' అండగా నిలిచింది. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెలుగులోకి తెచ్చింది. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి స్పందించి ఆ బాలికలకు దళితబంధు ప్రకటించారు. బీఆర్ఎస్ నేత క్యామ మల్లేశ్ రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. ఎంతో మంది దాతలు స్పందించి నిత్యావసర సామగ్రితోపాటు ఆర్థిక సాయం అందజేశారు.
- ఎలిమినేడుకు చెందిన నిరుపేద వృద్ధురాలు సీతమ్మ ఇల్లు కూలిపోయి బస్టాండ్‌లో ఆవాసం పొందుతున్న అంశాన్ని వెలుగులోకి తేగా ఎమ్మెల్యే తనయుడు ప్రశాంత్‌రెడ్డి స్పందించి పక్కాఇల్లు కట్టించాడు.



కోట్ల విలువైన భూములకు రక్షణ

- ప్రభుత్వ భూముల పరిరక్షణ దిశగా సాగించిన అక్షర పోరులో విలువైన ప్రజల ఆస్తిని పరిరక్షించింది. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలు, వెంచర్లలో ప్రజావసరాల కోసం వదిలిన పార్కులు, క్రీడా స్థలాలను కబ్జాదారుల బారినుంచి కాపాడింది.
- అత్తాపూర్ 507,511,513,514 సర్వే నంబర్లలోని 7.32 గుంటలు కబ్జా, కుర్మల్‌గూడ సర్వే నంబర్ 81/1, 80/2లలో 13 ఎకరాలు, జల్‌పల్లి సర్వే నంబర్ 108లోని నాలుగు ఎకరాలు, కొండాపూర్‌లోని సర్వే నంబర్ 133,134లలోని జంగమోనికుంట ఆక్రమణలను ఎత్తి చూపింది.
- తట్టి అన్నారం సర్వే నంబర్ 127లోని ఫారెస్ట్ భూముల కబ్జా, మొయినాబాద్ తోల్‌కట్ట సర్వే నంబర్ 138లో పేదల పేరుతో ప్రభుత్వ స్థలం ఆక్రమణ, మునుగనూర్ సర్వే నంబర్ 38/1లోని ఏడు ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలపై వరుస కథనాలతో వాటి పరిరక్షణకు తోడ్పడింది.
- ఫరూఖ్‌నగర్ కంసానిపల్లి సర్వే నంబర్ 129లోని ఫాంల్యాండ్స్ పేరుతో 'అసైన్డ్ భూముల్లో రియల్ గద్దలు' శీర్షికన 20 ఎకరాలకు పైగా జరిగిన ఆక్రమణలు, శంషాబాద్ పాల్మాకుల సర్వే నంబర్ 13లోని ఎకరం భూమి ఆక్రమణపై 'సర్కారి జాగా.. వేశాడు పాగా' శీర్షికన వరుస కథనాలు ప్రచురించింది.
- ఫార్మాసిటీ భూ సేకరణ పేరుతో భూదాన్ భూములు మాయం చేసిన అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. ఈ అంశంపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది.



అవినీతిని ఎత్తిచూపి.. అభివృద్ధికి సహకరించి

- రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్, విద్యుత్, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ఉద్యోగుల అవినీతిని ఎండగట్టింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడగట్టిన అధికారులను ఏసీబీకి పట్టించడంలో బాధితుల పక్షాన నిలిచి సహకరించింది.
- ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడంలో ముందుంది. 317 జీఓ బదిలీల్లో తలెత్తిన గందరగోళం సహా లక్డీకాపూల్ నుంచి కొంగరకు కలెక్టరేట్ తరలిపోయిన తర్వాత హెచ్‌ఆర్‌ఏ చెల్లింపు విషయంలో స్పష్టత లేక దసరా నేపథ్యంలో 'కలెక్టరేట్ ఉద్యోగులకు జీతాల్లేవు' శీర్షికన వేతన జీవులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.
- కడ్తాల్ మండలం ముద్విన్–ఆకుతోటపల్లి గ్రామాల మధ్య ప్రవహించే వాగుపై వంతెన నిర్మాణం లేక రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను 'వాగు దాటేదెట్టా..ఊరు చేరేదెట్టా?' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురించి, వంతెన నిర్మాణం కోసం రూ.1.80 కోట్లు మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించింది.





అధికారుల దృష్టికి తీసుకెళ్లి..

- భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి సాంకేతిక పరిజ్ఞానంలో ప్రభుత్వ, పట్టా, అసైన్డ్, వక్ఫ్ భూముల వివరాల నమోదులో అనేక పొరపాట్లు దొర్లాయి. సర్వే నంబర్లు, రైతుల పేర్లు, హద్దుల నమోదుపై వివాదాలు తలెత్తాయి. కలెక్టరేట్‌కు రోజుకు సగటున 25–30 మంది భూ బాధితులు వస్తున్నారు. వీరికి అండగా నిలిచి, వారి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమార్గం చూపించడంలో చొరవ చూపింది.
- మాడ్గుల మండలం ఇర్విన్ భూములపై 'సమస్యల ధరణి' శీర్షికన, యాచారం మండలం కొత్తపల్లిలో సర్వే నంబర్ 308,309 భూ బాధితుల ఆవేదనపై 'భూమి ఇదేమీ!' శీర్షికన ధరణి కెక్కని బాధితుల కష్టాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమార్గం చూపించింది.

బడిపిల్లలకు భరోసా

ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీ, గురుకుల, ఇతర వసతి గృహాల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాల లేమి, నాసిరకం భోజనంపై 'సమస్యల నిలయాలు', 'అద్దె భవనాలే దిక్కు', 'గీ బువ్వ తినలేం' వంటి శీర్షికలతో కథనాలు ప్రచురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. పులుసుమామిడి, కడ్తాల్ కేజీబీవీ స్కూళ్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని పాలకుల దృష్టికి తెచ్చి పనుల్లో వేగం పెంచేలా చేసింది. టీచర్ల లేమిపై తడ'బడి' శీర్షికన కథనంతో తాత్కాలిక చర్యలకు తోడ్పంది. వేళకు బస్సులు రాక గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'ఆర్టీసీ బస్ సర్వీసు.. తుస్' శీర్షికన కథనం ప్రచురించి, ఆయా రూట్లలో వేళకు బస్సులు నడిచేలా చర్యలు చేపట్టింది.







ఆలయ భూముల కబ్జాకు చెక్

పహాడీషరీఫ్: మామిడిపల్లి రంగనాయకుల స్వామి ఆలయ భూములను మింగేసే యత్నంపై 'సాక్షి'లో 2022 ఆగస్టు 23న ×దేవుడి భూమికే ఎసరు₹ శీర్షికన ప్రచురించిన కథనంతో కబ్జా బాగోతానికి చెక్ పడింది. సర్వే నంబర్ 99/2లోని రూ.100 కోట్ల విలువైన 15.23 ఎకరాల ఆలయ భూములను జేసీబీలతో చదును చేస్తూ కబ్జాకు పాల్పడుతున్నారని తెలుసుకున్న వెంటనే దేవాదాయ శాఖ అధికారులు భూములను సందర్శించి పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీరితో పాటు మామిడిపల్లి గ్రామస్తులు, రాష్ట్రీయ వానరసేన నాయకులు ఆలయ భూములను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కబ్జాలో ప్రాథమికంగా ప్రమేయమున్న వ్యక్తిపై అదే నెల 26న కేసు నమోదైంది. కబ్జా బాగోతాన్ని అడ్డుకునేలా సాక్షి చేసిన ప్రయత్నంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



రంగనాయకుల స్వామి ఆలయ భూమి ఇదే..

డిస్కంలో బకాయిలపై..

- డిస్కంలో ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించని యూనియన్ల తీరును బకాయి.. లడాయి శీర్షికన ప్రత్యేక కథనంతో ఎండగట్టింది. పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లించే వరకు వరుస కథనాలు ప్రచురించింది. అంతేకాదు కొత్త కనెక్షన్ల మంజూరు, ప్యానల్ బోర్డులు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు తదితర అంశాలపై ప్రత్యేక కథనం ప్రచురించింది. ముగ్గురు ఏడీఈలు, నలుగురు ఏఈలపై వేటుకు 'సాక్షి' దోహదపడింది.

క్లినికల్ ట్రయల్స్‌పై..

- నిలోఫర్ ఆస్పత్రిలో పసికూనలపై క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తున్న అంశాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఇదే అంశంపై అప్పట్లో పెద్ద చర్చ కూడా జరిగింది. ప్రభుత్వం చిన్నారులపై నిర్వహించే క్లినికల్ ట్రయల్స్‌పై ఆంక్షలు విధించింది.

ఆణిముత్యాలకు అండగా..

- పేద కుటుంబంలో పుట్టి టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన ఆణిముత్యాలకు సాక్షి అండగా నిలిచింది. దాతలను సమీకరించి..వారికి ఉన్నత చదువులు చదివించే విషయంలో అండగా నిలిచింది.

ఆస్పత్రుల్లో అవినీతిపై..

- ఉస్మానియా సహా నగరంలోని ప్రధాన ఆస్పత్రుల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనుల్లో జరుగుతున్న అవినీతిని వెలుగులోకి తెచ్చింది. అప్పట్లో గౌరీ శానిటేషన్ ఏజెన్సీని రద్దు చేసి, కేసు నమోదు చేసి, జైలుకు కూడా పంపింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుద్ధ్య ఉద్యోగుల హాజరుపై ఆ తర్వాత అనేక సంస్కరణలు చేపట్టడంలో 'సాక్షి' చూపిన చొరవ అనుపమానం.

అనైతిక వైద్యాన్ని నిలదీసి..

- నిఖిల్‌రెడ్డికి ఎత్తు పెంపు సర్జరీ అంశాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. కార్పొరేట్ ఆస్పత్రుల్లో వెలుగు చూస్తున్న అనైతిక వైద్యంపై రాసిన కథనం వైద్యారోగ్య శాఖను అప్పట్లో ఓ కుదుపు కుదిపివేసింది. సర్జరీ చేసిన వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆంక్షలు విధించింది. ఐదేళ్ల పాటు వారి ప్రాక్టీస్‌ను సస్పెండ్ చేసింది.

న్యూస్‌రీల్

సర్దార్‌నగర్ తైబజార్ వేలం రూ.42.10 లక్షలు



షాబాద్: సర్దార్‌నగర్ తైబజార్ వేలం పాట రూ.42.10 లక్షలు పలికినట్లు ఎంపీఓ హన్మంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సర్దర్‌నగర్ పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ మునగపాటి స్వరూప ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో మొత్తం 9 మంది పాల్గొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ. 26.51 లక్షలు ఉండగా కుర్వగూడ గ్రామానికి చెందిన ర్యాకల మల్లేశ్ రూ.42.10 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇంద్రమ్మ, మాజీ సర్పంచ్ నర్సింహులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న గీతారెడ్డి

కేశంపేట: యాసంగిలో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి అన్నారు. కొత్తపేట రైతువేదిక క్లస్టర్‌లోని వ్యవసాయ పొలాల్లో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అకాల వర్షాలతో జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ రైతులు అధిక దిగుబడి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి రాము, రైతులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

- కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి పునాదులు
- ఎమ్మెల్సీలు రమణ, వాణీదేవి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎల్.రమణ

ఆమనగల్లు: రాష్ట్రంలోని ప్రతి గడపకూ కేసీఆర్ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి ఎల్.రమణ, ఎమ్మెల్సీ వాణీదేవి, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే ఉందన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఆలేటి నారాయణసాగర్ ఫంక్షన్‌హాలులో గురువారం కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, సమన్వయ కమిటీ సభ్యుల సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు పొనుగోటి అర్జున్‌రావ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫంక్షన్ హాలు ఆవరణలో ఎమ్మెల్సీ రమణ బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు, పార్టీ పటిష్టత గురించి చర్చించారు. ఎమ్మెల్సీలు రమణ, వాణీదేవి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి పునాదులని అన్నారు. టీఆర్ఎస్‌కు కార్యకర్తల బలంతో పాటు ప్రజా బలం ఉందన్నారు. అదే బలంతో మూడోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ఆమనగల్లు, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్లు నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, జెడ్పీటీసీలు అనురాధ, ద్యాప విజితారెడ్డి, దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ నిట్టె నారాయణ, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, మండల, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షులు అర్జున్‌రావ్, పత్యానాయక్, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు భూపతిరెడ్డి, జైపాల్‌రెడ్డి, సంజీవ్‌యాదవ్, గోవర్ధన్, భాస్కర్‌రావ్, సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, అప్పం శ్రీను, సుభాష్, దోనాదుల కుమార్, సయ్యద్ ఖలీల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

మీర్‌పేట: వీధికుక్కల దాడిలో ఓ చిన్నారికి తీవ్ర గాయాలైన సంఘటన మీర్‌పేటలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఆర్ఎన్‌రెడ్డినగర్‌కు చెందిన వెంకటేశ్ వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. ఇతనికి భార్య మేఝా, కుమారుడు జున్ను (18 నెలలు) ఉన్నారు. ఉగాది పండుగ సందర్భంగా మీర్‌పేట కేశవరెడ్డినగర్‌లో నివసించే మేఝా తల్లిగారింటికి వచ్చారు. గురువారం ఉదయం ఇంటి వరండాలో చిన్నారి జున్నును తల్లి ఆడిస్తూ దుస్తులు తెచ్చేందుకని ఇంట్లోకి వెళ్లింది. గేటు తెరిచే ఉండడంతో లోపలికి వచ్చిన కుక్కలు జున్నుపై దాడి చేయగా చెవి, ముక్కు, వీపు భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం చిన్నారిని నారాయణగూడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం వైద్యులు తిరిగి ఇంటికి పంపించారు. ఈ మేరకు స్థానిక కార్పొరేటర్ అక్కి మాధవి చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



వీధికుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారి

ఓయూలో హైటెన్షన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. పేపర్ లీకేజీ వ్యవహారంపై ఐక్య విద్యార్థి సంఘాలు శుక్రవారం మహా నిరసన దీక్ష, ప్రగతి భవన్‌కు నిరుద్యోగ మార్చ్ చేపట్టనున్నాయి. వీటికి తోడు వర్సిటీలో ఓయూ ఆధ్వర్యంలో పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులు జరగనున్నాయి. అయితే నిరుద్యోగుల మహానిరసన దీక్షకు అనుమతి లేదని అధికారులు పేర్కొంటున్నారు. రేవంత్ రెడ్డి దీక్షకు హాజరైతే అడ్డుకుంటామని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు చెబుతుండగా, దీక్ష నిర్వహించి తీరుతామని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు స్పష్టం చేయడంతో టెన్షన్ నెలకొంది. ఈ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు చేశారు.



మహిళా రైతుకు ఇంటి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఫార్మాసిటీతో మహర్దశ

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: ఫార్మాసిటీతో ఈ ప్రాంతానికి మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి 121 గజాల చొప్పున ప్లాట్ల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రపంచస్థాయిలో గుర్తింపునిచ్చేలా కాలుష్యం లేకుండా 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలతో పాటు ఈ ప్రాంతం ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందుతుందని అన్నారు. ఫార్మాసిటీకి కేంద్రమే అన్ని రకాల అనుమతులిస్తే, బీజేపీ రాష్ట్ర నేతలు మాత్రం ప్రజల్లో అయోమయం సృష్టించడానికి కుట్రలు చేస్తున్నారన్నారు. ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారంతో పాటు మీర్‌ఖాన్‌పేటలో 612 ఎకరాల్లో నిర్మిస్తున్న హెచ్ఎండీఏ వెంచర్‌లో ఎకరా భూమికి 121 గజాల చొప్పున పట్టా సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు తెలిపారు. పేదలు బాగుపడుతుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఫార్మాసిటీకి భూములు సేకరిస్తున్న నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో నిషేధిత జాబితాలో పట్టా భూముల రికార్డులు పెట్టిన రైతులకు న్యాయం చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఫార్మాసిటీ చుట్టూ బఫర్‌జోన్ ఉండదని స్పష్టం చేశారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటాచారి, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, తహసీల్దార్ సుచరిత, ఎంపీడీఓ విజయలక్ష్మి, యాచారం పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, నందివనపర్తి, నక్కర్తమేడిపల్లి సర్పంచులు ఉదయశ్రీ, శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు పాశ్చ భాష, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్లు ఇచ్చి ఊర్లే ఖాళీ చేయిస్తరు

ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్లు ఇచ్చి ఊర్లనే ఖాళీ చేయించేలా కేసీఆర్ సర్కార్ కుట్ర చేస్తోందని ఎంపీపీ కొప్పు సుకన్య ఆరోపించారు. ఇంటి సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె బహిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో ఫార్మాసిటీకి భూములిచ్చిన పేద రైతులకు నేటికీ పరిహారం అందలేదని, పట్టా భూముల రికార్డులను నిషేధిత జాబితాలో పెట్టి మూడేళ్లుగా ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి

- శాస్త్రవేత్తలు వెంకటయ్య, జేసుదాసు, గోపీనాథ్
- డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీపై అవగాహన



డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

షాబాద్: వరి పంటకు ఆశించే చీడ పీడల నివారణకు డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేయాలని రాజేంద్రనగర్ భారతీయ వరి పరిశోధన శాస్త్రవేత్తలు వెంకటయ్య, జేసుదాసు, గోపీనాథ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ముద్దెంగూడ, బొబ్బిలిగామ గ్రామాల్లో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్ ఆధ్వర్యంలో రైతులకు డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బొబ్బిలిగామ, ముద్దెంగూడ గ్రామాల రైతులు యాదవరెడ్డి, చంద్రబాబు, మాధవరెడ్డి, రాంరెడ్డి, చెన్నయ్య, భూషయ్య, రాజు, భూపతిరాజు, కే వెంకటయ్య, లింగం, నరింహా, శేఖరయ్య, పాండు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

శంకర్‌పల్లి: పట్టణంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడులు చేశారు. హనుమాన్ నగర్ కాలనీలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు వెళ్లారు. పేకాట రాయుళ్లు తప్పించుకొని పారిపోయారు. పోలీసులు నాలుగు బైక్‌లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంపులో పడి బాలుడి మృతి



వినయ్ మృతదేహం

చేవెళ్ల: ఇంటి ముందు ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడు ఇంటి ఆవరణలోని నీటి సంపులో పడి మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చేవెళ్లకు చెందిన వీ రాజుచారికి ఇద్దరు కొడుకులు. చిన్న కొడుకు వినయ్(4) ఉదయం ఇంటి ముందు తోటి పిల్లలతో ఆడుకుంటూ సంపులో పడిపోయాడు. దీన్ని ఎవరూ గమనించలేదు. బాలుడు చాలా సేపు వరకు ఇంట్లోకి రాకపోవడంతో తల్లిదండ్రులు బయటకు వచ్చి చూశారు. ఎక్కడా కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. అయినా బాలుడి ఆచూకీ లభించలేదు. దీంతో సంపులో చూశారు. అందులో బాలుడు విగతజీవిగా కనిపించాడు. అప్పటివరకు కళ్ల ముందు ఆడుకుంటూ కనిపించిన పిల్లవాడు లేడనే విషయాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు. బోరున విలపించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మొయినాబాద్: మండలంలోని శ్రీరాంనగర్ రెవెన్యూలో హ్యాపీ హోమ్స్ ఎస్టేట్ వెంచర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. గురువారం పంచాయతీ కార్యదర్శి సజనామశ్రీ, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.

వడగండ్లతో వరికి తీవ్ర నష్టం

- వెయ్యి ఎకరాల్లో పంట నష్టం
- ప్రాథమికంగా అంచనా వేసిన వ్యవసాయ శాఖ
- రెండు రోజుల్లో తుది నివేదిక
- బాధిత రైతులు 600మంది
- రూ. 15 కోట్లకు పైగా పెట్టుబడులు నష్టం
- జీవాలకు మేతగా వరి పంట



మంతన్‌గౌరెల్లి శివారులోని వరి చేనులో గొర్రెలను మేపుతున్న కాపారులు

యాచారం: ఇటీవల కురిసిన వడగండ్ల వానకు ఇబ్రహీంపట్నం డివిజన్‌లో వెయ్యి ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, మాడ్గుల్ మండలాల్లో 15వేల ఎకరాలకు పైగా వరి పంటను సాగు చేశారు. ఎకరాకు రూ. 20వేల నుంచి రూ. 25 వేల వరకు ఖర్చు చేశారు. పంట చేతికి వచ్చే దశలో వడగండ్ల వాన తీవ్ర నష్టం కలిగించింది. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో వడగండ్ల వానకు వెయ్యి ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. దాదాపు 600 మంది రైతులకు నష్టం చేకూరినట్లు నివేదిక తయారు చేశారు. దాదాపు రూ. 10 కోట్ల నుంచి రూ. 15 కోట్లకు పైగా పెట్టుబడులు నష్టపోయారు. యాచారం మండలం మంతన్‌గౌరెల్లి, చింతపట్ల, నల్లవెల్లి, మొండిగౌరెల్లి, తమ్మలోనిగూడ, మాల్, మంచాల మండలం బోడకొండ, లోయపల్లి, ఎల్లమ్మతండాల్లో వరి పంటకు తీవ్రంగా నష్టం జరిగింది. పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక చేసేదేమీ లేక వరి పంటను పశువుల మేత కోసం కోసేస్తున్నారు. గొర్రెలు, మేకలను పొలాల్లోకి వదిలేస్తున్నారు. పంట నష్టపరిహారంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు రూ. 50 వేలు ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రూ. 2లక్షలు నష్టపోయా



ఏడు ఎకరాల్లో వరి పంట వేశా. ఎకరాకు రూ. 20 వేల నుంచి రూ. 25 వేలు వరకు పెట్టుబడి పెట్టా. పంట చేతికి వచ్చే సమయంలో వడగండ్ల వాన పడింది. దీంతో పూర్తిగా పంట దెబ్బతింది. రూ. 2.5లక్షలు నష్టపోయా. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. లేకుంటే అప్పులపాలవుతాం.

– యాదయ్యగౌడ్, రైతు, మంతన్‌గౌరెల్లి

నివేదిక తయారు చేస్తున్నాం



వడగండ్ల వానకు యాచా రం, మంచాల మండలా ల్లో వెయ్యి ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథ మికంగా అంచానా వేశాం. క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి పంట నష్టం వివరాలు సేకరిస్తున్నాం. రెండు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక తయారవుతుంది. పరిహారం చెల్లింపుపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

– సత్యనారాయణ, ఏడీఏ, ఇబ్రహీంపట్నం

హుండీలో నగదు చోరీ

శంకర్‌పల్లి: పట్టణంలోని మార్కెట్ కమిటీ ఆవరణ గల రేణుక ఎల్లమ్మ ఆలయంలో హుండీ తాళం పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మార్కెట్‌లోని కూరగాయల కమీషన్ ఏజెంట్ శేఖర్‌రెడ్డి గురువారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బీ శశిధర్‌రెడ్డి ఆలయాన్ని పరిశీలించారు. బుధవారం పండుగ ఉండడంతో సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మార్కెట్ కమిటీ ఆవరణలోని సీసీ పుటేజీని సేకరించారు. గతంలో మార్కెట్‌లో దొంగతనం జరిగింది, ఉల్లి గడ్డల సంచులు ఎత్తుకెళ్లారని కూరగాయల ఏజెంట్లు తెలిపారు. ఇటీవల మహిళ మెడలోంచి పుస్తెల తాడును లాక్కెల్లారని వివరించారు. మార్కెట్ కమిటీ పరిసరాల్లో పోలీసులు గస్తీ నిర్వహించాలని కోరారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

ఆమనగల్లు: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు పెద్దయ్యగౌడ్ మృతిచెందిన సంఘటన మాడ్గుల మండలం నాగిళ్ల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గురువారం మృతుని కుటుంబాన్ని రాష్ట్ర గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు వెంకన్నగౌడ్ పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు యాదయ్యగౌడ్, రాజుగౌడ్, వెంకటయ్యగౌడ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. మృతుని కుటుంబానికి ఐక్యత ఫౌండేషన్ సభ్యులు జైపాల్‌రెడ్డి, శివగౌడ్, శివ, జంగయ్య, శివరాజ్‌గౌడ్ పరామర్శించి రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు.

ఎమ్మెల్యేపై అసభ్య పోస్టులు చేసిన వ్యక్తి రిమాండ్

కేశంపేట: ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో పాటు కుటుంబ సభ్యులపై అసభ్య పదజాలంతో సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు షాద్‌నగర్ రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ నిందితుడి వివరాలు వెల్లడించారు. మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేటకు చెందిన ఏ మదన్‌మోహన్ ఉగాది పండుగ రోజు సోషల్ మీడియాలో ఎమ్మెల్యేతో పాటు ఆయన కుటుంబసభ్యులపై అసభ్య పోస్టు పెట్టాడు. దీనిపై కొత్తపేటకు చెందిన జమాల్‌ఖాన్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిపై గతంలో కొత్తూర్, కేశంపేట పీఎస్‌లలో రెండు కేసులు ఉన్నట్లు తెలిపారు. మదనమోహన్‌పై రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ధనుంజయ్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: బీజేపీ జిల్లా కార్యదర్శిగా చేవెళ్ల మండలం ఇక్కారెడ్డిగూడకు చెందిన వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బీ నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు కే వెంకటేశ్వర్లు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే ప్రకాష్, ప్రధాన కార్యదర్శులు అనంత్‌రెడ్డి, మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటరాంరెడ్డి, కృష్ణాగౌడ్, బీజేవైఎం నియోజకవర్గం అధ్యక్షుడు ఏ శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేద్దాం



అవార్డులు వచ్చిన పంచాయతీ సర్పంచులను అభినందిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

ఎంపీపీ రఘుమారెడ్డి

- పలు పంచాయతీలకు అవార్డుల ప్రదానం

మహేశ్వరం: బాధ్యతాయుతంగా పని చేసి గ్రామాలను అభివృద్ధిలో ముందుంచాలని ఎంపీపీ రఘుమారెడ్డి సర్పంచ్, ఎంపీటీసీలకు సూచించారు. గురువారం ఎంపీడీఓ సమావేశం మందిరంలో జాతీయ పంచాయతీ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వివిధ కేటగిరీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన పంచాయతీలకు అవార్డుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీని అభివృద్ధి, సంక్షేమంలో నడిపించేందుకు ముందుకు రావాలన్నారు. సర్పంచులు తమకు ఇచ్చిన అధికారాలను పూర్తిగా వినియోగించుకోవాలని, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆర్ సునిత, ఎంపీడీఓ బి.నర్సింహ, ఈఓపీఆర్డీ రవీందర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు పొందిన పంచాయతీలు ఇవే...

1. పేదరికం లేని మెరుగైన జీవనోపాధి పంచాయతీలు: సిరిగిరిపురం, మెహబ్బత్‌నగర్, నాగారం
2. ఆరోగ్యకరమైన పంచాయతీలు: హర్షగూడ, ఉప్పుగడ్డ తండా, గొల్లూరు
3. చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీలు: హర్షగూడ, కోళ్లపడకల్, గొల్లూరు
4. వాటర్ సఫిషియంట్ పంచాయతీలు: ఘట్టుపల్లి, గంగారం, దుబ్బచర్ల
5. క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీలు: నందుపల్లి, తుమ్మలూరు... తుప్రఖుర్దు, ఆకన్‌పల్లి
6. స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పించిన పంచాయతీలు: తుమ్మలూరు, మన్సాన్‌పల్లి, తుప్రఖుర్దు
7. సామాజిక భద్రత కలిగిన పంచాయతీలు: డబిల్‌గూడ, పెద్దమ్మ తండా, అమీర్‌పేట్
8. సుపరిపాలన పంచాయతీలు: నాగారం, గొల్లూరు, నాగిరెడ్డిపల్లి
9. మహిళా స్నేహపూర్వక పంచాయతీలు: సుభాన్‌పూర్, పడమటి తండా, ఉప్పుగడ్డ తండా, గొల్లూరు, డబిల్‌గూడ

మొండిబకాయిలపై నిరసనాస్త్రం!



కటికపల్లిలో పన్నులు చెల్లించని వారి ఇంటి ముందు నిరసన తెలుపుతున్న సర్పంచ్

కందుకూరు: ఇంటి పన్నులు చెల్లించని మొండి బకాయిదారులపై ఆ గ్రామ పంచాయతీ సిబ్బంది వినూత్న నిరసన చేపడుతోంది. బకాయిదారుల ఇంట్లోనే కూర్చొని పన్నులు వసూలయ్యే వరకు అక్కడి నుంచి కదలడం లేదు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం కటికపల్లి పంచాయతీ పరిధిలో ఇంటి పన్నుకు సంబంధించిన మొండి బకాయిలు పేరుకుపోయాయి. దీంతో గ్రామ పంచాయతీ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. మార్చి నెల పూర్తవుతున్నా చాలా మంది ఇంటి పన్నులు చెల్లించలేదు. అధికారుల నుంచి వీరిపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. దీంతో గురువారం సర్పంచ్ బి.నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి పన్నులు వసూలు కార్యక్రమం చేపట్టారు. చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్న వారి ఇంట్లోనే నిరసనకు దిగారు. డబ్బులు వసూలయ్యే వరకు వదలడం లేదు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఇంటి పన్నులు సకాలంలో చెల్లిస్తేనే అన్ని విధాలుగా గ్రామాభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో వైష్ణవికి 3వ స్థానం

- వాతావరణ శాఖ పోస్టర్ విభాగంలో విద్యార్థినికి బహుమతి
- అభినందించిన పాఠశాల సిబ్బంది



రాష్ట్రస్థాయి బహుమతి అందుకుంటున్న విద్యార్థిని వైష్ణవి

కేశంపేట: ప్రపంచ వాతావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని బేగంపేట వాతావరణ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ తయారీపై గురువారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 172మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి ఇంగ్లిష్ మీడియం చదువుతున్న వైష్ణవి, సౌమ్య, కీర్తన, మహాలక్ష్మి పాల్గొన్నారు. వీరిలో వైష్ణవి వాతావరణ పోస్టర్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 3వ స్థానంలో నిలిచింది. విద్యార్థినికి వాతావరణశాఖ డైరెక్టర్ నాగలక్ష్మి బహుమతిని అందించారు. ఈ పోటీలను సైంటిస్టు శ్రావణి పర్యవేక్షించారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చడంపై ఇన్‌చార్జి హెచ్‌ఎం, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు శిరీష, సాయిప్రసాద్ రావు, రాజు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ధన్యవాదలు తెలిపారు.